మోడీ మనువాదం..దేశానికి ప్రమాదకరం..

కెవిపిఎస్-సిఐటియు సదస్సులో కేరళ ఎంఎల్‌ఎ శాంతకుమారి వార్త జనరల్ పేజీలో..

# నాలుగు దశాబ్దాలుగా ఏఈగానే..!

## ప్రమోషన్లు లేకనే ఉద్యోగ విరమణలు
## టిటిడి ఇంజినీరింగ్‌శాఖలో వింత ధోరణి

## నేడు ఇంజినీర్స్ దినోత్సవం

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ**

తిరుమల తిరుపతి దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంలో వింత ధోరణి కొనసాగుతోంది. ఖాళీ పోస్టుల భర్తీ లేదు. ప్రమోషన్లు ఊసేలేదు. దశాబ్దాల తరబడి ఒకే పోస్టులో విధులు నిర్వహించి, అదే పదవిలోనే ఉద్యోగ విరమణ చేయాల్సిన దయనీయ పరిస్థితి. ఆధ్యాత్మిక ప్రజ్వలనగరిలైన ప్రదేశంలో ఆత్మక్షోభతో ఇంజినీర్లు విధులను నిర్వహిస్తుండటం శోచనీయం. పాలకులు మారినా, ఈవోలు కొత్తగా వచ్చినా ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీ పోస్టుల భర్తీ, ప్రమోషన్ల ఊసే లేకపోవడం గమనార్హం. సెప్టెంబర్ 15న సోమవారం ఇంజనీర్స్ డే పురస్కరించుకుని టిటిడిలో ఇంజినీర్ల 'వ్యథ'ను ప్రజాశక్తి మీకు అందిస్తోంది.

టిటిడిలో ఇంజినీరింగ్ విభాగం అత్యంత కీలకమైనది. భక్తుల వసతికి అవసరమైన నిర్మాణాలు చేపట్టడం, ఘాట్ రోడ్ల పర్యవేక్షణ, క్యూలైన్లు, విద్యుత్ కాంతులకు అవసరమైన లైన్లు, తాగునీటి సరఫరా, పరిపాలనకు అవసరమైన కార్యాలయాల నిర్మాణాలు ఇలా అనేక పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ విభాగానిదే. మార్కెటింగ్, జ్యూవెలరీ, హెల్త్ విభాగాలను పర్యవేక్షించాల్సిన అదనపు బాధ్యత ఈ శాఖకే కేటాయించారు. ఇన్ని రకాల విధులు, అనేక విభాగాలను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ శాఖలో కొత్త పోస్టుల భర్తీ మాట దేవుడెరుగు, ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించడంలోనూ నిర్లక్ష్యమే. ఆఖరికి ప్రోటోకాల్ విధులను కూడా ఇంజినీర్లే పర్యవేక్షిస్తున్న పరిస్థితి. ఇంతటి కీలకమైన ఇంజినీర్లకు కనీసం అర్హత ఉన్నా ప్రమోషన్లు ఇవ్వకపోవడం విడ్డూరం. ఓ పక్క సిబ్బంది కొరత, మరో పక్క ఉన్నత పదవులైన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (డిప్యూటీ ఈఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈ) పదవులు ఖాళీగా ఉన్నాయి. అత్యంత కీలకమైన ఈ పదవుల్లో ఉన్నతాధికారులైన సూపరింటెండెంట్ ఇంజనీర్లు (ఎస్ఈలు) కిందిస్థాయి పోస్టులకు ఇన్‌ఛార్జీలుగా నియమిస్తున్నారే తప్ప, అర్హత ఉన్న వారికి పదోన్నతులు ఇవ్వడంలో అలసత్వం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. సుమారు 450 మంది ఇంజనీర్లు వివిధ కేటగిరీల్లో అవసరం కాగా కేవలం 220 మందితో నెట్టుకొస్తున్నారు. పదోన్నతులు లేకుండానే ఒకే పోస్టులో సర్వీసు మొత్తం విధులు నిర్వహించి, పదవి విరమణ చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కేవలం టిటిడి ఇంజినీరింగ్ విభాగంలోనే చోటు చేసుకుంటోంది.

**నాలుగు దశాబ్దాలుగా ఏఈగానే..!**

సుమారు నాలుగు దశాబ్దాలుగా ఓ వ్యక్తి ఏఈగానే విధులు నిర్వహిస్తున్నారు. మరో 16 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ విరమణ సమయానికి కూడా పదోన్నతి దక్కే పరిస్థితి లేదు. ప్రస్తుతం శ్రీపద్మావతి డిగ్రీ కళాశాలలో ఏఈగా పని చేస్తున్న ఓ ఇంజనీర్, 1986, అక్టోబరు నెలలో టిటిడి ఏఈగా విధుల్లో చేరి, తొలిత పరిపాలన భవనంలో విధులు నిర్వహించారు. అనంతరం టిటిడి అనుబంధ ఆలయాలైన కన్యాకుమారి, విజయవాడ, కర్నూలు, కరీంనగర్, హైదరాబాదు, అనంతపురం వంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు పదోన్నతి లభించి ఉంటే ఒట్టు. మూడు సంవత్సరాలుగా అనేక మంది ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. సుమారు నలుగురు ఈవోలు, ముగ్గురు చైర్మన్లకు అనేక విన్నపాలు పెట్టుకున్నారు. అయినా ఐనా ప్రయోజనం లేదు. కోర్టు సైతం ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఆదేశించినా, ఈవోలు, జేఈవోలకు దీన్నిపై నిర్ణయం తీసుకునే సమయమే లేదనేలా వ్యవహరిస్తుండడం శోచనీయం. టిటిడి యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో అనేక మంది ఇంజనీర్లు పదోన్నతులు లేకుండానే పదవి విరమణలు చేస్తున్నారు. 1998లో డిప్యూటీఈఈగా పదోన్నతి పొందిన ఇంజనీర్ రామకృష్ణ 27 సంవత్సరాలుగా ఆ పదవిలోనే ఉన్నారు. త్వరలో రిటైర్డ్‌మెంట్ అయ్యే ఆయనకు ఈఈ పదవి కలగానే మిగిలేలా ఉంది. నాలుగు నెలలకు ముందు ఇద్దరు డిప్యూటీ ఈఈలు, ముగ్గురు ఏఈలు ఎలాంటి పదోన్నతి లేకుండానే పదవీ విరమణ చేశారు. మరో ఏడాదిలో సుమారు పాతికమంది ఇంజనీర్లు ఎలాంటి పదోన్నతులు నోచుకోకుండానే రిటైర్మెంట్ అవనున్నారు. పోనీ టిటిడి ఆర్థిక పరిస్థితి బాగాలేదు అనడానికి లేదు. ప్రతి రోజూ వందల కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్న ఏకైక సంస్థ. రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తి కలిగి, రెండో ప్రభుత్వంగా వ్యవహరించే సీనియర్ అధికారులు, పాలకవర్గం గల వ్యవస్థ టిటిడి. టిటిడి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎవరికీ దక్కని విధంగా రెండోసారి ఈవోగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించిన అనిల్‌కుమార్ సింఘాల్ అయినా ఇంజనీర్స్ డే పురస్కరించుకుని ఇంజనీర్లకు తీపి కబురు అందిస్తారని ఇంజనీరింగ్ విభాగం మొత్తం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది.

# 'సాధికారత'తోనే మహిళకు 'భవిష్యత్'

## తిరుపతి వేదికగా జాతీయ సదస్సు ప్రారంభం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, చంద్రగిరి**

'మహిళల సాధికారత అనేది ఒకేసారి జరిగే కార్యాచరణ కాదని, నిరంతర ప్రక్రియని, గ్రామపంచాయతీ నుండి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, అమత్ కాలంలో నారీ శక్తి దేశాన్ని సమగ్రత, శక్తివంతమైన భవిష్యత్తు వైపు నడిపించే అప్రతిహత శక్తిగా రూపుదిద్దుకుంటోంది' అని అన్నారు. మహిళల సమానత్వం, నాయకత్వం, భాగస్వామ్యం - న్యాయం మాత్రమే కాకుండా, సమగ్ర, స్థిరమైన అభివద్ధికి పునాది అని స్పష్టం చేశారు. తిరుపతి వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళాసాధికారత సదస్సును జాతీయగీతం, రాష్ట్రగీతాలాపనతో ఆదివారం ఉదయం ప్రారంభించారు. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు డి. పురందేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామ కష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖా మాత్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ చైర్పర్సన్ గౌరు చరితారెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవర లతో కలసి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. తిరుపతి జిల్లా ప్రజాప్రతినిధులు లోక్‌సభ స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి సత్కరించారు. కలెక్టర్ డాక్టన్ ఎస్.వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు అందించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి సభ్యులతో కలిసి తిలకించారు.

భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్ పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ యొక్క లక్ష్యాలను సాధించడంలో సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మహిళా నేతత్వంలోని అభివద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని , బేటీ బచావో, బేటీ పఢావో, స్టాండప్ ఇండియా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన వంటి పథకాల అమలు ద్వారా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని తెలిపారు.

1997లో మహిళా సాధికారత కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీ మహిళలకు సంబంధించిన అనేక సమస్యలపై 87 నివేదికలను సమర్పించిందని తెలిపారు. కమిటీ తన సిఫార్సుల ద్వారా విధానపరమైన మార్పులకు దోహదపడిందని పేర్కొన్నారు. నేడు జరుగుతున్న ఈ సమావేశం మహిళా సాధికారత కమిటీల చైర్ పర్సన్లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా అనుభవాలను పంచుకోవడానికి, ఉత్తమ విధానాలను మార్పిడి చేసుకోవడానికి, సవాళ్లను పరిష్కరించడానికి సూచనలు చేయడానికి ఒక వేదికగా ఈ సదస్సు అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

మధ్యాహ్న భోజన విరామ సమయంలో శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ జిల్లా కలెక్టర్ తో కలసి భోజన ఏర్పాట్లను పరిశీలించి సదస్సుకు హాజరైన వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, గూడూరు, సూళ్ళురుపేట, జి.డి. నెల్లూరు, రాప్తాడు, ఆళ్లగడ్డ, కడప జిల్లాల ఎమ్మెల్యేలు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు

**చంద్రగిరి కోటలో 'సౌండ్ లైట్' షో వినోదం**

'మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు'లో భాగంగా ఆదివారం రాత్రి చంద్రగిరి మండల కేంద్రంలోని చంద్రగిరి కోటలో సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన డెలిగేట్లకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆతిథ్యం ఇచ్చారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ అతిథులకు స్వాగతం పలికారు. చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తినాని సతీసమేతంగా అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, చిత్తూరు ఎంఎల్‌ఎలు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ రీజన్ డైరెక్టర్ రమణప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతి వేదికగా మహిళా సాధికారత సదస్సులో ప్రతినిధులు

**మహిళలకు సంస్కరణలు తెచ్చింది ఎన్టీఆర్ : అయ్యన్నపాత్రుడు**

మహిళా సాధికారతకు కృషి చేసి అనేక సంస్కరణలు తీసుకొచ్చింది మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సినిమాల్లో హీరోగా ఉన్నపుడే గుండమ్మకథ సినిమాలో 'లేచింది నిద్ర లేచింది మహిళా లోకం' అంటూ మహిళ గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటారన్నారు. ఆయన టిడిపి వ్యవస్థాపకుడు కావడం అదృష్టమని, ఆయన జాడల్లోనే పార్టీ నడుస్తుందన్నారు. మహిళలకు ఆస్తిలో వాటా, చదువులో రిజర్వేషన్, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆయన చొరవేనన్నారు.

**గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం**

తిరుపతిలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో పల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేశారు. జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**శ్రీవారి సేవలో ప్రముఖులు**

తిరుమల శ్రీవారిని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ ఆదడివారం ఉదయం దర్శించుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయక మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రటాన్ని అందించారుకీ కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాజ్యసభ ఎంపి సుధా నారాయణమూర్తి పాల్గొన్నారు.

**లోకసభ స్పీకర్‌ను కలిసిన పిసి రాయలు**

తిరుపతి పర్యటనకు విచ్చేసిన లోకసభ స్పీకర్ ఓం బిర్లాను కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్, విమానాశ్రయ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యుడిగా, అనేక పదవులను నిర్వహిస్తున్న డాక్టర్ పి.సి. రాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి తాజ్ హెూటల్లో స్పీకర్ ను కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సత్కరించారు.

# 'కలర్‌షైన్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

గూడూరు మండల పరిధిలోని తుంగపాలెంలో ఉన్న కలర్‌షైన్ పరిశ్రమలో మిషనరీ దగ్గర అకస్మాత్తుగా పేలుడు సంభవించిన ఘటనపై సిఐటియు నాయకులు స్పందిస్తూ వెంటనే లాక్‌డౌన్ ప్రకటించి, ఘటనకు గల కారణాలను విచారించాలని డిమాండ్‌చేశారు. ఆదివారం ఫ్యాక్టరీ ముందు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జింక్‌పాట్ అకస్మాత్తుగా పేలిన ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ మృతిచెందాడని, అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. పది మందికి పైగా కళ్లు, కాళ్లు, చేతులు పోగొట్టుకుని క్షతగాత్రులై నెల్లూరు, మద్రాసు ఆస్పత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఆదిత్యకుమార్ ద్రవంలో పడిపోయి ద్రవంగా మారిపోయి, కనీసం చివరి చూపు ఆనవాళ్లు లేకుండా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించిందని, కంటతడి కలిగించిందన్నారు. సంబంధిత మెషనరీ చెకింగ్ సరిగ్గా చేయకపోవడం, మిషనరీ అరుగుదలను గుర్తించకపోవడం, నాశిరకం పైపులు వంటి ప్రధాన లోపాలను గుర్తించకపోవడం వల్లనే పేలుడు సంభవించిందన్నారురు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్య లోపంగా గుర్తించి, సంబంధిత ఉన్నతాధికారుల చేత దర్యాప్తు చేయించి, వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటివరకూ కలర్‌షైన్ పరిశ్రమను లాక్‌డౌన్‌గా ప్రకటించాలన్నారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ.50 లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. వైద్యఖర్చులు పూర్తిగా యాజమాన్యమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.వెంకటరామిరెడ్డి, బివి రమణయ్య, జోగి శివకుమార్, గుర్రం రమణయ్య, గండికోట మధు, ఎస్‌డి రఫీ, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

**యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి :కాంగ్రెస్**

కార్మికుని మృతికి కారణమైన కలర్‌షైన్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.గతంలో ఇదే పరిశ్రమలో అనేకమార్లు ఇలాంటి ఘటనలు జరిగినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

# 'డ్రగ్స్ ఫ్రీ' తిరుపతిగా మార్చేందుకు కృషి

## ఎస్పీ సుబ్బారాయుడు బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**



'శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని, తిరుపతిని డ్రగ్స్ ఫ్రీ'గా మార్చేందుకు కృషి చేస్తానని తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎల్. సుబ్బారాయుడు చెప్పారు. ఆదివారం తొలుత తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉంచడమే పోలీసుల ధ్యేయమని, 24 గంటల పాటు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా ఉంటామన్నారు. విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండే కాకుండా ప్రపంచంలోని అన్ని దేశాల నుండి శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందన్నారు. మహిళల రక్షణకు పెద్దపీట వేస్తామని, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

# హాల్‌మార్క్ బంగారు నగలే అమ్మాలి

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

బంగారు నగలు వ్యాపారం చేసే వ్యాపారస్తులు తప్పనిసరిగా హాల్ మార్క్ కలిగిన బంగారు నగలే అమ్మకాలు చేయాలని ది ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ శాంతి లాల్ జైన్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె వి సత్యనారాయణ, ఎస్ జితేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హెూటల్లో ఆ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బంగారు నగల వ్యాపారాలు చేసే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బంగారు నగలు వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా హాల్ మార్క్ కలిగిన నగలే అమ్మకాలు చేయాలని ఆదేశించడం తో వ్యాపారులు ఆ దిశగా వ్యాపారాలు చేయాలని కోరారు. వ్యాపారులు తప్పకుండా లైసెన్స్ తీసుకొని బంగారు నగలు వ్యాపారం చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిఎస్టి అధికారులు, ఇన్కమ్ టాక్స్ అధికారుల దష్టికి తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. నవంబర్ 21, 22, 23వ తేదీల్లో విజయవాడలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్లో ఏపీజీ జేఎఫ్ బి టు బి జువెలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో 26 జిల్లాల నుంచి 70 అసోసియేషన్లు, 350 మంది ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సభ్యులు హాజరయ్యారు.

## పెండింగ్ ప్లాట్‌దారులకు న్యాయం చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

శెట్టిపల్లిలో స్థలాలను కొని పెండింగ్‌లో ఉన్న ఫ్లాట్ దారులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయంలో ఫ్లాట్‌దారులతో సమావేశం జరిగింది. వందవాసి నాగరాజు మాట్లాడుతూ 2019లో రెవిన్యూ ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లు ఉన్న దాదాపు మూడు వందల మంది ఫ్లాట్ దారులను పెండింగ్లో పెట్టారని అన్నారు. కొన్న వారు రిజిస్ట్రేషన్ కూడా చేసుకొన్నారని పేర్కొన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికీ న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఇప్పుడు అనేక కారణాలు చూపిస్తూ వీరికి అన్యాయం చేయడం తగదు అన్నారు. పెండింగ్ ప్లాటుదారుల సమస్యలపై ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కషి చేస్తామని, పెండింగు ఫ్లాటుదారులకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్, శెట్టిపల్లి ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ ఏ .రాధాకష్ణ, సిపిఎం నాయకులు ఎస్.జయచంద్ర, ఎం. నరేంద్ర, జి చిన్న బాబు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మ పాలకమండలి ప్రమాణస్వీకారం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం ఉదయం సంప్రదాయబద్ధంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న పాలకమండలి సభ్యులు అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రమాణం చేశారు. 11 మంది సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులు పూజారి మురళీ స్వామి సహా ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ నేతత్వంలో ఉదయం 8 గంటల నుంచి 8.20 గంటల మధ్య సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. అలాగే శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా సచివాలయ సేవలు

## వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన / 'ప్రజాశక్తి'తో జిల్లా అధికారి నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవలను ఆయా కార్యాలయాలకు వెళ్ళనవసరం లేకుండా గ్రామ వార్డు సచివాలయాలలో పొందేలా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రజలకు ఇంటి వద్ద నుండే ప్రభుత్వ సేవలు అందించడానికి వాట్సాప్ గవర్నెన్స్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఏ అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్న సచివాలయం ద్వారా ఇప్పటివరకు ప్రజలు ఈ సేవలను అందుకుంటున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెట్టి దీనిపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఆదేశాలు జారీచేసింది. అయితే సచివాలయాలు ద్వారా ప్రజలు ఎన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి...వాటి వివరాలను జిల్లా సచివాలయాల అధికారి నారాయణ రెడ్డి ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వివరించారు.

**ప్రజాశక్తి: వాట్సాప్ గవర్నెన్స్ వలన ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు చేకూరుతాయి?**

అధికారి: ప్రభుత్వం ఇప్పటివరకు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో మండల పరిధిలో ఉండే ప్రభుత్వ కార్యాలయాల్లో ముందే సేవలను కూడా సచివాలయాలలో పొందే విధంగా చర్యలు చేపట్టింది. అయితే నూతనంగా తీసుకువచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ వలన ఇంటి వద్ద నుండే ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లను చేసింది. ఇందుకుగాను వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్ ఫామ్ ఫోన్ నెంబర్ 9552300009 ను రిజిస్టర్ మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చు. ఇందులో 709 సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

**ప్రజాశక్తి: వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?**

**అధికారి:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి వాట్సాప్ గవర్నెన్స్ పై తప్పకుండా అవగాహన కార్యక్రమాలు చేస్తూ, ప్రజల నుండి ఏదో ఒక సేవను ఎలా వినియోగించుకోవాలి, ఎలా నమోదు చేసుకోవాలి అన్న ప్రక్రియను దగ్గరుండి నిర్వర్తించేలా చేస్తున్నాము. శుక్రవారం ఏదేని కారణాల చేత సెలవుదినంగా ప్రకటిస్తే మరుసటి రోజు కొనసాగుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం మేరకు ప్రజల వద్దకు తీసుకెళుతున్నాం.

**ప్రజాశక్తి: సచివాలయాల పనితీరుపై ఏ విధమైన తనిఖీలు నిర్వహిస్తారు?**

**అధికారి:** జిల్లాలోని సచివాలయాలు ప్రజలకు అందిస్తున్న సర్వీసులుపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. డివిజన్ స్థాయి అధికారులు, మండలంలో ఎంపీడీవోలు ఆయా పరిధిలోని సచివాలయాలు ప్రజలకు అందించే సేవలలో తప్పొప్పులు జరగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో నేను కూడా అప్పుడప్పుడు ఆకస్మికంగా కొన్ని మండలాలకు వెళ్లి సచివాలయాలను తనిఖీలు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ లక్ష్యం మేరకు సచివాలయాలలో ప్రజలకు సేవలు పొందేలా తగిన జాగ్రత్తలను తీసుకుంటున్నాం. నిర్దేశించిన గడువులోపు ప్రజలు కోరిన ప్రభుత్వ సేవలు వారు పొందుతున్నారా లేదా అనే విషయాలను గమనిస్తాం.

## స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూలు మేళా

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

**ప్రజాశక్తి -ఏర్పేడు :** మండ లంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు మేళాను స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పల్లం పంగూరు, వాంపల్లి, వేలంపాడు జిల్లా పరిషత్ విద్యార్థులలో 60 మంది పేద విద్యార్థులు గుర్తించి విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు మేళా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గోవర్ధన్, పంగూరు ప్రధానోపాధ్యాయులు రామచంద్ర, వేలం పాడు, పల్లం వాంపల్లి నుంచి ఉపాధ్యాయులు చంద్రయ్య, తులసి కుమార్, శేఖర్, కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి- పాకాల:** తిరుపతి సిమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు ఉచిత వైద్య పరీక్షలను పాకాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, దామలచెరువు సచివాలయం 1 లో సోమవారం క్యాంపులు నిర్వహిస్తున్నామని పిహెచ్‌సి డాక్టర్లు బాబు, అలగ్జండర్, రవిరామ్‌లు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఈ క్యాంపు ప్రారంభమవుతుందని ఉచితంగా నోరు, రొమ్ము, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలకు కూడా నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపులో పాల్గొనేవారు తప్పనిసరిగా తమతో పాటు ఆధార్ కార్డు, ఫోను నెంబరును తీసుకురావాలని కోరారు.

## సరుకులు వితరణ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సివిసి పార్క్ , గూడూరులో ఎంఈఓ రవూఫ్ దాతృత్వంలో గాంధీనగర్‌కు చెందిన అబ్దుల్ రెహమాన్‌కు వాకర్, ప్రొవిజన్స్, కూరగాయలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ యేసుపాక పెంచలయ్య చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్‌లో నివసిస్తున్న అబ్దుల్ రెహమాన్ వాకర్ అవసరమని జనవిజ్ఞాన వేదిక వారిని సంప్రదించారు. బాధితుడు అడిగినట్లే జెవివి వారు వాకర్, ప్రొవిజన్స్, కూరగాయలు ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకున్నందుకు జనవిజ్ఞాన వేదిక సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఎస్సీ, ఎస్టీ మెంబర్ సురేంద్ర, చెంచు నారాయణ, రామ మోహన్, ప్రభాకర్, రజనీకాంత్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచారి, ఆనంద్. శర్మ , ఉదయ్ కుమార్ , వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని సేవలో ఏపీ డిప్యూటీ స్పీకర్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** తిరుపతి పర్యటనకు ఆదివారం వచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమ రాజు వడమాల పేట మండలం అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, పోలీసులు పాల్గొన్నారు.

## నేడు గ్రీవెన్స్ డే రద్దు: తహశీల్దారు

**ప్రజాశక్తి -దొరవారిసత్రం:** తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌డేను రద్దుచేసినట్లు తహశీల్దారు సైలకుమారి తెలిపారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి వద్ద జాతీయ మహిళ సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీలకు సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేశారు. అందువల్ల జిల్లా, మండలం స్థాయిలో నిర్వహించనున్న గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు ఆమె తెలిపారు.

**శ్రీకాళహస్తి:** మహిళా సాధికారత సదస్సు నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సోమవారం నిర్వహిం చాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు పరిచినట్లు శ్రీకాళహస్తి తహశీల్దారు జనార్ధన రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు రావాలనుకునే ప్రజలు సదరు విషయంపై చింతించకుండా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎన్‌పీపీఎంఎల్‌ఓపీఏ రాష్ట్ర సలహాదారుగా మురళీ నాయుడు**

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ లేబరేటరీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రభు ల్యాబ్ అధినేత పత్తిపాటి మురళీ నాయుడు నియమితు లయ్యారు. మంగళగిరిలో ఆదివారం నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ లేబరేటరీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా మురళి నాయుడు నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు లేబరేటరీల నిర్వాహకులు మురళి నాయుడుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రైవేట్ బస్సులు తనిఖీలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు జాతీయ రహదారి పై సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి 18 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టివో సిబ్బంది మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏంవి ఐ లు ప్రభాకర్ రావు, శాంతి, హోమ్ గార్డులు నరేష్, శ్యామ్, సుధీర్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

## దేవీ నవరాత్రులు పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన కనకాచలం దుర్గాదేవి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

## కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

### పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-బాలాయపల్లి:**

మండలంలోని సిద్ధాగుంట గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. వెంకటగిరి మండలం బంగారుపేట నుంచి బాలాయపల్లి మండలంలోని నిడిగల్లుకు వెళ్లే మార్గంలోని సిద్ధాగుంట గ్రామం పరిధిలో తారు రోడ్డు ఆనుకుని ఉన్న లక్షల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వే నెంబరు 113.7లోని సుమారు 20 ఎకరాలను వెంకటగిరి పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించి ఎక్స్వేటర్‌తో చదును చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులకు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో కొన్నాళ్లు ఊరుకున్నారు. మళ్లీ వారం రోజుల క్రితం రాత్రికిరాత్రే భూమిని దుక్కి చేశారు. లక్షలు విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినా అధికారులు పట్టించుకోక పోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విచారించి చర్యలు తీసుకుంటాం..**

ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాము..

**- విజయలక్ష్మి, తహశీల్దారు.**

దుక్కి దున్నిన ప్రభుత్వ భూమి

## తిరుమలలో స్పెషల్ డ్రైవ్

### అనాధికారులు, యాచకులు తరలింపు

**ప్రజాశక్తి -తిరుమల:** తిరుమలలో పోలీసులు స్పెషల్ డ్రైవర్ చేపట్టారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భద్రతను దృష్టిలో ఉంచుకుని యాచకులు, అనధికార వ్యాపారు లను తిరుమల నుంచి తరలిస్తున్నారు. టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి మురళీకృష్ణ , తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టీటీడీ విజిలెన్స్, హెల్త్ అండ్ శానిటేషన్ , తిరుమల పోలీసుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కళ్యాణకట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉన్న 82 మంది యాచకులు, అనధికార వ్యాపారులను గుర్తించి తిరుపతికి పంపించారు. అనుమానితుల వేలి ముద్రలు కూడా పరిశీలించారు. స్థానిక హోటళ్లు, టీ దుకాణాలు, చిల్లర దుకాణాల యజమానులు, తిరుమలలో పని ముగించిన తర్వాత, తమ వద్ద పనిచేసే వారికి తగిన వసతిని తిరుపతిలో కల్పించాలని పోలీసులు సూచించారు. ఆగస్టులో కూడా ఇలాంటి డ్రైవ్‌లో 75 మందిని తరలించగా, ఇకపై కూడా నిరంతరం ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు, టీటీడీ విజిలెన్స్, హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఆటో కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :** ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నుంచి 15 వేల రూపాయలు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, అయితే కార్మిక సంఘాలన్నీ 25 వేల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు ఎస్.జయచంద్ర అన్నారు. ఆటో కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ వద్ద వామపక్ష కార్మిక అనుబంధ యూనియన్ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆటో యూనియన్ సమావేశం జరిగింది. స్త్రీశక్తి పథకంతో ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఎక్కువమంది ఆటో కార్మికులు డిగ్రీలు, పీజీలు చదువుకుని సొంత జీవనం కొనసాగిస్తున్నారన్నారు. స్త్రీశక్తి పథకం వల్ల 12 లక్షల కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. మోటార్ వెహికల్ చట్టం వల్ల పెనాల్టీల మీద పెనాల్టీలు వేసి కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. మరోవైపు ఓలా, ఓపెన్, రాపిడో వల్ల కార్మికులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం కేవలం రెండు లక్షల 90వేల మందికి రూ.450 కోట్ల రూపాయలను విడుదల చేసిందన్నారు. మిగిలిన కార్మికుల పరిస్థితి ఏంటన్నారు. 15వ తేదీ కలెక్టరేట్ల వద్ద, 18న చలో విజయవాడ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు తంజావూరు మురళి, బాదుల్లా, ప్రధాన కార్యదర్శి వాసు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..** స్త్రీ శక్తి పథకంతో ఆర్థికంగా నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆటో కార్మికుల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమ గోడ పత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ప్రాంతీయ అధ్యక్షులు గురునాధం, కార్యదర్శి పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

## వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న కొల్లపూడి సుబ్బయ్య

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్లపూడి సుబ్బయ్య డిమాండు చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సేవకుల జీతాలు పెంచాలని, నైట్ డ్యూటీలు ఆపాలని, నామినీలను వీఆర్ఏగా గుర్తించాలని కోరారు. డివిజన్ స్థాయిలో 14 మండలాల నుండి 15వ తేదీ సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామని ఆ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె బంధకి సాహెబ్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వీఆర్ఏలు అందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకుల మండల అధ్యక్షులు రామయ్య , గ్రామ సేవకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి: ఎస్ఐ

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. మండలంలోని బస్టాండు ఆవరణలో ఆదివారం ఎస్ఐ విశ్వనాథ నాయుడు తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు ఆపకూడదని రోడ్డుకు విరువైపులా ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపినచో దుకాణాల యజమానులపై చర్యలు చేసుకుంటామని వాహనాలు ఆపే వారికి దుకాణదారులే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ అప్పటి కప్పుడు క్లియర్ చేయాలని బస్టాండులలో ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉండడం వలన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని బస్సులు కూడా బస్టాండ్ ఆవరణలో ఆగకుండా ముందుకు వెళ్లి ఆగడంతో ప్రయాణికులైన ముసలివారు చిన్నవారు చిన్న పిల్లలు బస్సు కోసం పరుగెత్తాలని అలా జరగకుండా బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ ఎవరైనా వాహనా లు ఆపినట్టైతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర్ సురేష్ గురవయ్య రమేష పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నగరి నియోజకవర్గంలోని పేదవారు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం తన దగ్గరికి వచ్చి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని ఇది ఎంతో సంతృప్తి నిస్తోందని నగరి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం తడుకుకు చెందిన కె బాలయ్య కు రు. 96,185లు, తొర్రూరుకు చెందిన డి పూజితకు రు. 1,59, వేల రూపాయలు, పరమేశ్వర మంగళంకు చెందిన జానకి రామానాయుడుకు రూ.1,50,223 లు. గొల్లపల్లికి చెందిన మునెమ్మ కు రూ.29,584లు, పుత్తూరు మున్సిపాలిటీ రాచపాలెం కు చెందిన దొరై రాజుకు రు. 1,28,048 లు విజయపురం మండలం జిఎం పురం కు చెందిన కే. రేవతి కు రు. 2.50 వేలు లు చెక్కులు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు. మొత్తం ఆరుగురికి రూ.8,13,040లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, బాలాజీ. బొబ్బిలి యాదవ్, మోహన్ రాజు పాల్గొన్నారు.

## నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** సామాజిక అంశాలపై చర్చలు నిర్వహించుకోవడానికి సెమినార్ హాళ్లు, ఆడిటోరియంలు ఇవ్వకుండా యూనివర్సిటీ ఇన్‌చార్జీ, వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లు జారీ చేసిన అప్రజాస్వామిక ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు పేర్కొన్నారు. సోమవారం రౌండ్ టేబుల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## వేమారెడ్డికి పరామర్శ

**ప్రజాశక్తి -చిల్లకూరు:** చిల్లకూరు మండలం మోమిడి లో వైసీపీ నాయకుడు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డిని మాజీ మంత్రి కాకాణి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ని దెబ్బతీసేందుకు నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని, కుమారస్వామి రెడ్డి కుటుంబం పై కక్షసాధింపు చేస్తున్నారని అన్నారు.

## ఐకమత్యంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** రాష్ట్రంలోని బలిజలు అందరూ ఐకమత్యమే మహాబలం అన్న విధంగా ఐక్యంగా ముందుకెళ్ళినప్పుడే అభివృద్ధి పథంలో ముందుకెళ్లవచ్చని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం స్థానిక ఉదయి ఇంటర్నేషనల్ హోటల్‌లో బలిజ సేన"రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన బలిజ సేన రాష్ట్ర స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర హస్త, చేనేత కళల డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 600 మందికి పైగా సభ్యులు హాజరయ్యారు. డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేనకి తోడుగా బలిజ సేన ఉందని, భుజబలం బుద్ధి బలం కలిగిన వారే బలిజలని అన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కష్ణ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, ఉపాధ్యక్షులు రాయని రమేష్, మస్తాన్ రాయల్, సంయుక్త కార్యదర్శి గీతాంజలి రమణ పాల్గొన్నారు.

## వాటంబేడులో ధార్మిక సమ్మేళనం

**ప్రజాశక్తి - సూళ్లూరుపేట:** అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం వాటంబేడు గ్రామంలో ఆదివారం దార్మిక సమ్మేళనము జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీ శ్రీ విజయ శంకర స్వామీజీ వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు హాజరై తమ ధార్మిక ప్రసంగం చేశారు.

## ఆదాయం తగ్గడానికి కారణాలేమిటి?

### జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - వెంకటగిరి:** వెంకటగిరి పోలేరమ్మ జాతరలో ఆదాయం తగ్గడానికి కారణాలు ఏమిటో చెప్పాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, వెంకటగిరి నియోజకవర్గ పిఓసి గూడూరు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలకు లోబడి టిడిపికి నియోజకవర్గంలో కష్టపడి పనిచేశామని, అయితే జాతరలో ఎక్కడ తమకు ఆ స్థాయిలో ప్రాధాన్యత కనిపించలేదన్నారు. వైసిపి హయాంలో పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా పనిచేసిన గొల్లగుంట మురళీకృష్ణ టిడిపి కూటమి హయాంలోనూ పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా నియమించడం టిడిపి, జనసేన, బిజెపి ల్లో ఆ స్థాయి నాయకుడు లేరా? అని ప్రశ్నించారు. జాతర చాటు నుంచి ఘటోత్సవం అమ్మవారి విరుపోత్సవం వరకు ఆచార వ్యవహారాలకు తిలోదకాలు ఇచ్చారని, జాతరలో వెంకటగిరి రాజాలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని ఇవ్వలేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు కు ఐదు గురితో మాత్రమే దర్శనం కల్పిస్తామని చెప్పిన మాటను స్థానిక దేవాదాయశాఖ అధికారులు తుంగలో తొక్కి ఒక్కో ఎమ్మెల్యే తో సుమారు 150 మంది వరకు వీఐపీ దర్శనాలను కల్పించి జాతర ఆదాయానికి గండి కొట్టారని ఆరోపించారు. దర్శన టిక్కెట్లలోనూ అస్తవ్యస్తంగా వుందన్నారు.

## తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు..

తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్న

**ప్రజాశక్తి- పాకాల:** చంద్రగిరి మండలం మామండూరు గ్రామానికి చెందిన చిన్న (15) మతిస్థిమితం లేని బాలిక శనివారం నడుచుకుంటూ వెళ్లి పాకాల మండలం కుండేటివారి పల్లికి చేరుకొంది. గ్రామస్థులు ఆ అమ్మాయికి భోజనం పెట్టి వివరాలు అడగగా మౌనంగా వుండిపోయింది. దీంతో ఏం చేయాలో తెలియక వారు పాకాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇది తమకు సంబంధించిన విషయం కాదని ఐసిడిఎస్ వారికి తెలపాలని సలహాఇచ్చారు. తర్వాత ఐసిడిఎస్ వారికి తెలపడంతో వారు ఆ బాలికను రేణిగుంట వద్ద వున్న అభయకేంద్రానికి అప్పగించామని తెలిపారు. దీంతో గ్రామస్తులకు ఏమి చేయాలో తెలియక రాత్రి తిరిగి అంగన్ వాడీ కార్యాకర్తలను ప్రాధేయపడడంతో అంగన్‌వాడీ కార్యకర్త సంధ్య స్పందించి అమ్మాయి వివరాలు తెలుసుకున్నారు. ఆ బాలిక తనది చంద్రగిరి అని చెప్పడంతో ఆదివారం పది గంటలకు పూర్తి చిరునామా తెలుసుకున్నారు. చంద్రగిరి మండలం మా మండూరు గ్రామానికి చెందిన నాగమణి, రామచంద్ర నాయుడు అని చెప్పడంతో వెంటనే అమ్మాయిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అధికారులు స్పందించ పోయినా కుందేటి పల్లి గ్రామస్థులు చూపిన చొరవను పలువురు ప్రశంసించారు. మతి స్థిమితం లేని అమ్మాయిని తిరిగి తమ చెంతకు చేర్చడంతో బాలిక తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## కిరణ్ కుమార్ కు గౌరవ డాక్టరేట్

**ప్రజాశక్తి-నాయుడుపేట:** నాయుడుపేట మండలంలో 108 అంబులెన్స్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్‌కు ఎంబిఆర్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. హర్యానాకు చెందిన ఎమ్ బిఆర్ యూనివర్సిటీ 2025వ సంవత్సరానికి ప్రతిభా, సామాజిక సేవ వంటి విభాగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డుల ప్రదానం యూనివర్సిటీ కన్వకేషన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట 108 అంబులెన్సు లో ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషిన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్‌ను ఆ సంస్థ గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. ఆయన ఎమ్ఎస్‌సి (మైక్రోబయాలజీ) బి ఈ డి,అడ్వాన్స్ డిప్లొమా ఇన్ ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంటి ఉన్నత విద్యను అభ్యసించి 19 సంవత్సరాలనుండి 108 అంబులెన్సులో పనిచేస్తున్నారు. గత 9 సంవత్సరాలుగా 108 ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులుగా, నాయుడుపేట రోటరీ క్లబ్ మెంబెర్ గా పని చేస్తున్నారు. ఆయన సామాజిక సేవలను గుర్తించి గతం లో అర్పిత స్వచ్ఛంద సంస్థ, కల్చరల్ సోషల్ వాలంటీర్ ఆర్గనైజషన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ వారిచే ఆంధ్రరత్న బిరుదును అందుకున్నారు. పలు సన్మానాలు పొందారు.

## అంతర్జాతీయ జర్నల్స్ ఎడిటోరియల్ బోర్డుల్లో ఎస్‌వియూ అధ్యాపకుడు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టరు ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎడిటోరియల్ బోర్డులో సభ్యత్వాన్ని పొందారు. ఆయన ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ అండ్ సైన్స్, ఎడ్విన్ గ్రూప్ ఆఫ్ జర్నల్స్ వంటి ప్రముఖ పత్రికల ఎడిటోరియల్ బోర్డుల్లో కూడా సేవలందిస్తున్నారు. అదనంగా, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ టెక్నాలజీ, జర్నల్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ వంటి అంతర్జాతీయ పత్రికలకు సమీక్షకుడిగా (రివ్యూయర్) వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## తిరుపతి సదస్సుకు బొజ్జల

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** తిరుపతి సమీపంలోని రాహుల్ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న దేశ వ్యాప్త మహిళా సాధికారత సదస్సుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఆదివారమే ఆయన సభాస్థలికి చేరుకున్నారు. అక్కడికి విచ్చేసిన మహిళా ప్రజాప్రతినిధులను సాదరంగా ఆహ్వానించి పేరుపేరునా పలకరించారు.

## రైతు సంఘం ఎన్నిక

**ప్రజాశక్తి -రేణిగుంట:** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రేణిగుంట మండల మహాసభ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రేణిగుంట జిఎం వీధి లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వద్ద చీరాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. రైతు సంఘం మండల నూతన కమిటీ 13 మందితో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముని రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గుణశేఖర్, కోశాధికారిగా చీరాలయ్య, ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, గోపి, సహాయ కార్యదర్శిగా మాధవి, మునిరాజా, కమిటీ సభ్యులుగా చంద్ర, నాగరాజు, ఛాలెంజ్, చిట్టెమ్మ, ఈశ్వరయ్య, వెంకటస్వామి, ఎన్నికయ్యారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, అధ్యక్షుడు రంగయ్య హాజరై మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో టమోటా పండిస్తున్న రైతులు పండించిన టమోటా పంటకు కిలో రూ 5, 6 లు మాత్రమే దక్కుతోంది. టమోటా పండించిన రైతులు టమోటా పంటకు గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతున్నారు. టమోటా పండించిన రైతులకు కనీసం కిలో రూ.20 నుండి 25 రూపాయలు ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుంది. కానీ వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి రైతులకు కనీస ధర ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది రైతులకు కాకుండా వ్యాపారులకే సహకరిస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రేణిగుంట మండలం లో అటవీ ప్రాంతంలో ఏనుగులు మామిడి తోటను, కోతకొచ్చిన పంటను ధ్వంసం చేస్తున్నాయని, మామండూరు గ్రామ రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జి పాలెం పంచాయితీ నల్ల పాలెం రైతుల పంటలను ధ్వంసం చేస్తున్న పెంపుడు పందుల యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు అండగా నిలబడాలని ఈ కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రేణిగుంట మండల మహాసభల ద్వారా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## టిటిడి బోర్డు సభ్యుడుగా సుదర్శన్ వేణు ప్రమాణస్వీకారం

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** టిటిడి పాలకమండలి సభ్యులుగా నియమితులైన టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ సుదర్శన్ వేణు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రెండవసారి పాలకమండలి సభ్యుడిగా నియమితులైన ఆయన తన తండ్రి వేణు శ్రీనివాసన్, భార్యా తారా వేణుతో కలిసి ఆలయం వద్దకు చేరుకోగా, టిటిడి అధికారులు ఆయన వద్ద ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వేణు పదోన్నతి పొందారు. తాజాగా టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనను పలువురు అభినందించారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# క్రైం న్యూస్

## ఆభరణాలు చోరీ

**ప్రజాశక్తి-ఏర్పేడు:** మండలంలోని మల్లంపల్లిలో రెండు గిరిజన కుటుంబాలలో గుర్తు తెలియని నిందితులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. ఒక గృహంలో ఏమీ లభించలేదు. గజ్జల నాగరాజ, నారాయణమ్మ దంపతుల ఇంటిలో రెండు సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గిరిజనులు వెంకటగిరి జాతరకు బుధవారం సాయంత్రం వెళ్లి ఆదివారం ఇంటికి చేరుకోవడంతో ఈ చోరీ చోటు చేసుకుందని గుర్తించారు. ఒక చైను, (రెండు సవరాలు), కమ్మలు ఒక జత, రెండు ఉంగరాలు మొత్తం మూడు సవరాలు బంగారు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఈనెల 9 వ తేదీ గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీ నగర్ ప్రాంతంలోని సమాధుల సమీపంలో చోటు చేసుకున్న హత్య కేసులో నిందితులను గూడూరు రెండో పట్టణ పోలీస్‌లు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కోగృహాల్లో నివసిస్తున్న రహీద్ భాషా అలియాస్ మున్నా అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ, ఇందిరమ్మకాలనీకి చెందిన షఫీర్ అలియాస్ అజ్జు ముగ్గురు స్నేహితులు వున్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి ముగ్గురు కలిసి ఇందిరమ్మకాలనీలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం తాగి అక్కడి నుంచి ఓ మోటారుబైక్‌లో ముగ్గురు కలిసి ఒకటో పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేసి తిరిగి టిడ్కోగృహాల వద్దకు వెళుతుండగా రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్ కళాశాల దాటిన అనంతరం రహీద్ బాషాకు షఫీర్‌కు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీనగర్ క్రిస్టియన్ సమాధుల వద్ద మోటారుబైకు నిలిపారు. ఇంతలో మరో నిందితుడు వెంకటేశ్వర్లు కూడా రహీద్ బాషా పై గతంలో తాను సహజీవనం చేస్తున్న వందన విషయమై అసభ్యకరంగా మాట్లాడిన విషయాన్ని మనసులో ఉంచుకుని రహీద్ బాషా పై దాడికి పాల్పడ్డారన్నారు. వెంకటేశ్వర్లు అతని వద్ద ఉన్న చాకుతో రహీద్ బాషాను హత్య చేశారన్నారు. అతని బైక్ ను సమీపంలోని సబ్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు వద్ద ఉంచి ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారన్నారు. హత్య చేసిన అనంతరం వెంకటేశ్వర్లు, షఫీర్ అనే ఇద్దరు నిందితులు టిడ్కో గృహాల్లో నివసిస్తున్న వందన ఇంటికి వెళ్లగా ఆమె వారికి ఆశ్రయం కల్పించిం దన్నారు. ఈనెల 10వ తేదీన ఉదయం ఈ ముగ్గురు నిందితులు కలిసి చిల్లకూరు మండలం కనుపూరు గ్రామానికి వెళ్లి అక్కడ తల దాచుకుని ఆదివారం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఉండగా వారిని అరెస్ట్ చేశామన్నారు. దీంతో హత్యకు పాల్పడిన వెంకటేశ్వర్లు, షఫీర్ తోపాటు వీరు తప్పించుకునేందుకు సహకరించిన వందనను అరెస్ట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామేశ్వరరావు, షాజహాన్ పాల్గొన్నారు.

## ఆటో అదుపు తప్పి డ్రైవర్ మృతి

**ప్రజాశక్తి -చిట్టమూరు:** ఆటో అదుపు తప్పి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. చిట్టమూరు మండలం కోగిలి గ్రామ దళితవాడకు చెందిన కమత మణి (42), భార్య పద్మ, 10వ తరగతి చదువుతున్న కుమారుడు తో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం మణి యధావిధిగా కొత్తగుంటకు వచ్చి ఆటో నడుపుకుంటూ మధ్యాహ్నం భోజనానికి కోగిలి కి వెళుతుండగా మధ్యలో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. అక్కడే ఉన్నా గ్రామస్తుల సాయంతో108కు సమాచారం అందించి హాస్పిటల్ కి తీసుకెళ్లగా మనీ మృతి చెందినట్లు నిర్ధారించారు. అందులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఆ కుటుంబానికి పెద్ద దిక్కు కమతం మనీ మృతి పట్ల వారి బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నారు.

## హత్యా లేక ఆత్మహత్యా?

### - ఇద్దరి పిల్లలను పూడ్చిపెట్టి ఇద్దరు ఆత్మహత్య

**ప్రజాశక్తి- పాకాల:** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం, గాదంకి పంచాయతీ పరిధిలోని టోల్ గేట్ ప్లాజా సమీపంలోని హోటల్ వెనుక అడవిలో గుర్తుతెలియని కుటుంబం, ఇద్దరి పిల్లలను పూడ్చిపెట్టి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహాలు కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. ఆదివారం స్థానిక పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మొదట పాకాల పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఇది చంద్రగిరి పరిధిలోకి వస్తుందని గుర్తించి తెలపడంతో చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విషయాలను సేకరి స్తున్నారు. ఎవరైనా చంపి పూడ్చి పెట్టారా? లేక ఇంకేమైనా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రయాణికురాలి నుంచి నగదు అపహరణ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ఆర్టీసీ బస్సులో కూర్చుని ఉన్న ఓ ప్రయాణికురాలి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు అపహరించిన సంఘటన ఆదివారం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ లో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. తిరుపతికి వెళ్లే బస్సులో ఓ మహిళ బ్యాగుతో కూర్చుంది. అదే సమయంలో యాచకులుగా వెళ్లిన ఓ మహిళ, బాలుడు బస్సు ఎక్కి మహిళ చేతిలో బ్యాగును లాక్కుని ఉడాయించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మహిళ బ్యాగులో రూ. 3.85 లక్షల నగదు ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

## సీతారాం ఏచూరికి నివాళి

**ప్రజాశక్తి - రేణిగుంట :** జిఎం వీధిలోని సుందరయ్యభవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాంఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరి కమ్యూనిస్టు భావాల పట్ల ఇష్టంతో, నిబద్ధతతో తుదిశ్వాస వరకూ నిర్విరామంగా కృషి చేసిన ఏచూరి బాటలో నడవడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం పట్ల నిబద్ధతతో తన జీవితాన్ని సాకారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఒ.వెంకటరమణ, జిబిఎస్ మణ్యం, జయచంద్ర, బాలాజీ, కొండ్రెడ్డి హరినాథ్, ఎంపిటిసి రాజేశ్వరి, ఈశ్వరమ్మ, సత్యశ్రీ పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజాభివృద్ధిలో, దేశాభి వృద్ధిలో భాగస్వాములను చేసేది ఉపాధ్యాయులు మాత్రమే నని తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ మాట్లాడుతూ దేశ స్థితిగతులను మార్చే శక్తి విద్యార్థులకు ఉందని, అలాంటి విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీఈవో కుమార్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ,ప్రవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు జనార్దన్ రెడ్డి, రమణారెడ్డి, వాసు, విశ్వనాథరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆర్‌కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌కు అవార్డులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** స్థానిక బైరాగిపట్టెడ అర్చ్ సమీపంలో గల వీక్షా ది స్కూల్ ఉపాధ్యాయురాలు, హెడ్ మిస్ట్రెస్ ఆర్‌కే విమల అప్పుస్మా బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. వందలాది విద్యార్థులకు విద్యను బోధించడం, అబాకస్ విద్యను అనేకమంది పిల్లలకు బోధించడం వల్ల ఈ గౌరవం లభించిందని స్కూల్ చైర్మన్, ఆర్‌కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్‌కే రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆర్‌కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆర్‌కే రెడ్డి బెస్ట్ కరస్పాండెంట్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డులను చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్, పుత్తలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి, తిరుపతి డీఈఓ కెవిఎన్ కుమార్, అప్పుస్మా స్టేట్ ప్రెసిడెంట్ తులసి విష్ణు ప్రసాద్, జోనల్4 ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి ల సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమంలో నాలంద కరస్పాండెంట్ ఓ వెంకటరమణ రెడ్డి, గేట్ చైర్మన్ డాక్టర్ టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ కార్యవర్గం

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - క్యాంపస్ :**

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ లోని ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి శ్రీధర్ గుర్రంకొండ నిర్వహించిన ఎన్నికలలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నుంచి ఎం. తిమ్మప్ప అధ్యక్షులుగా, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి నెల్లూరు సుబ్రహ్మణ్యం జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషాదాయకం. మీడియా కోఆర్డినేటర్ గా బి. మనోజ్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

## గాలివానకు కూలిన ఇల్లు

**ప్రజాశక్తి- చౌడేపల్లి:**

గాలివాన కారణంగా ఓ ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పరికతన పంచాయతీ మడుకూరుకు చెందిన మునుస్వామి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో అతనికి ఒక ఇల్లు ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వానకు మునుస్వామి ఇల్లు నేలమట్టమైంది. ఒకవైపు మాత్రమే గోడ కూలి పడిపోయింది. ఆ సమయంలో ఎవరు ఇంట్లో లేకపోవడం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇల్లును కోల్పోయిన బాధితునికి ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏనుగుల దాడి

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని బోడిరెడ్డిగారిపల్లి గ్రామం చల్లావారిపల్లి పరిసరాలలో అడవులలో నుంచి ఏనుగులు ఆదివారం వేకువజామున రైతులకు చెందిన పంటలపై దాడి చేయడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చల్లావారిపల్లి గ్రామ రైతులు మధుసూదన్ నాయుడు, గురు ప్రసాద్, విజయ్ కుమార్, బాలసుబ్రమణ్యం తదితర రైతులకు చెందిన టమోటా పంటలు తొక్కి నాశనం చేశాయి. అల్లనేరేడు, కొబ్బరి చెట్లను విరిచి ధ్వంసం చేశాయి. పంటలకు ఏర్పాటు చేసుకున్న కంచె, రాత్రి కూసాలను విరిచేశాయి. పులిచెర్ల మండల పరిసరాలలో ప్రతిరోజు ఏదో ఒకచోట ఏనుగుల దాడి వలన రైతులకు నష్టం వాటిల్లుతూనే ఉంది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం అందించాలని, ఏనుగుల దాడులను నియంత్రించాలని రైతులు వేడుకుంటున్నారు.

# డేటా సైన్స్ అనువర్తనాల విశ్లేషణలో సాంఖ్యక శాస్త్రం కీలకం

### - ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా రాజశేఖర్ రెడ్డి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** భవిష్యత్తులో డేటా సైన్స్ అనువర్తనాల విశ్లేషణలో సాంఖ్యక శాస్త్రం ప్రముఖ పాత్ర వహిస్తుందని ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ఎస్వియు విశ్రాంత ఆచార్యులు, ఐఎస్‌పిఎస్ జాతీయ గౌరవ అధ్యక్షులు ఆచార్య పుత్తా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఐఎస్‌పీఎస్ డేటా సైన్స్ సెంటర్, నలందానగర్ లో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న 'స్టాటిస్టికల్ లెర్నింగ్ అండ్ డేటా సైన్స్ ఫౌండేషన్స్ అండ్ అప్లికేషన్స్' జాతీయ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గణాంకశాస్త్ర విభాగం, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఎస్వియూ స్టాట్ అలుమ్నీ సంయుక్తంగా 10- 14వ తేదీ సెప్టెంబర్ 2025 మధ్య హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించారు. ఎస్వి యూనివర్సిటీ గణాంకశాస్త్ర స్థాపక ఆచార్యులు ప్రొ.ఎంపి. శాస్త్రి జయంతి వేడుకల (2025-26) సందర్భంలో ఒక భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ఎం.పి. శాస్త్రి, ప్రొఫెసర్ సి.ఆర్. రావు వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ, ప్రాంతంలో గణాంక విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నందుకు ప్రశంసలు వ్యక్తం చేశారు. విద్యార్థులు సాంఖ్యక శాస్త్ర అనువర్తనాలు, విశ్లేషణ గురించి పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ఉన్నతరంగాల్లో రాణించాలని సూచించారు. గణాంక శాస్త్రంలో డేటా సైన్స్ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం. శివపార్వతి, ప్రొ. ఆర్. విష్ణువర్ధన్, ప్రొఫెసర్ ఆఫ్ స్టాటిస్టిక్స్, పాండిచేరి యూనివర్సిటీ, స్టాట్ అలుమ్ని, డా. గణేష్ తలారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్, హమీర్‌పూర్ (హిమాచల్ ప్రదేశ్) స్టాట్ అలుమ్నీ, ప్రొఫెసర్ ఎంపి శాస్త్రి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### అష్టదళ పాదపద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**ప్రజాశక్తి -తిరుమల:** తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు జరగనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 16న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఉదయం 6 నుండి ఉదయం 10 గంటల వరకు ఒక మహా యజ్ఞం లా జరుగుతుంది. తర్వాత ప్రధాన దేవతపై ఉన్న వస్త్రాన్ని తొలగించి, లోపల ఇతర పరివార దేవతలు, దీపం పూజ వస్తువులను మళ్లీ లోనికి తీసుకొస్తారు . అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పిస్తారు. సంవత్సరానికి నాలుగు సార్లు ఈ వైదిక కార్యక్రమం నిర్వహిస్తారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి మరియు వార్షిక బ్రహ్మోత్సవాలు ముందు వచ్చే మంగళవారం ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ.

**16న వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు**

టీటీడీ ఈ నెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను (ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా) రద్దు చేసింది. సెప్టెంబర్ 15న ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించరు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాశక్తి -చంద్రగిరి:** చంద్రగిరిలో ప్రారంభమైన "మహిళా సాధికారతపై పార్లమెంటు, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు' లో భాగంగా ఆదివారం రాత్రి చంద్రగిరి మండల కేంద్రం లోని చంద్రగిరి కోటలోసదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన డెలిగేట్లకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఆతిథ్యం ఇచ్చారు. ఇందులో భాగంగా చంద్రగిరి కోట విశేషాలను తెలుపు సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని సభ్యులకు ప్రదర్శించారు.

## గురువులకు ఘన సత్కారం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "బెస్ట్ టీచర్ అవార్డ్స్ ఫెలిసిటేషన్ ప్రోగ్రామ్" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని,పుత్తలపట్టు శాసన సభ్యులు కె.మురళీ మోహన్, ఎంఎల్సి ఎం.వి. రామచంద్ర రెడ్డి, ఏపీ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ ఎం. సుగుణమ్మ,తుడా చైర్మన్ డా. సి.దివాకర్ రెడ్డి,తిరుపతి జిల్లా విద్యా శాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ తో పాటు పలువురు గౌరవ అతిథులు విచ్చేసి వేడుకను మరింత ప్రతిష్టాత్మకం చేశారని ఈ కార్యక్రమ గౌరవాధ్యకులు డా. ఎన్.విశ్వనాథ్ రెడ్డి, అధ్యక్షులు డా. టీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు కె. తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, పివి.రమణరెడ్డి, కె.ఎస్.వాసు, ఎస్. శ్రీనివాసులు రెడ్డి,వి.ఆర్. రెడ్డితో పాటు,తిరుపతి జిల్లా నాయకులు బి.రవీంద్ర రెడ్డి, ఎస్. భాస్కర్ రాజు, ఓ.వెంకటరమణరెడ్డి, డి.జి.రఘునారాయణ రావు,వై.

జనార్ధన రెడ్డి,ఎస్.ఎం. బాషా,డా. టి. రామకృష్ణ రెడ్డి,ఆర్. శ్రీధర్ రెడ్డి,డా. ఎన్. మాధవి,కె. గిరి కుమార్ రెడ్డి,పి. వెంకటేశ్ బాబు,జి.వి. పవన్ కుమార్,ఎం. సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొని రాయలసీమ జోన్ వ్యాప్తంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి ఎంపిక చేసిన 500 మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు "బెస్ట్ టీచర్ అవార్డ్స్" ప్రదానం చేసి సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలు, త్యాగం, నిబద్ధత, విద్యా రంగంలో చేస్తున్న కృషిని స్మరించుకుంటూ వేదిక నిండా అభినందనలు వెల్లువెత్తాయి. ఈ మహోత్సవం విశేషంగా నిలిచి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సో నమోదు అయ్యే ఘనత సాధించింది. ఈ రికార్డు ఏపీ చరిత్రలో మరో సువర్ణాక్షరాల విజయకేతనం ఎగురవేసింది.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** ఎస్వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ ఆసుపత్రి అధినేత డాక్టర్ రఘురాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఒక ప్రక్రియగా తమ సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. భవిష్యత్తులోనూ పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం జరిగిన వైద్య శిబిరానికి దాదాపు 100 మందికి పైగా అనేక రకాల జబ్బులకి సంబంధించి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.కష్ణ కుమార్, డాక్టర్ వి కె మానస, హాస్పటల్ సిబ్బంది షబ్బీర్ పాల్గొన్నారు.

## ట్రై సైకిల్ పంపిణీ

**ప్రజాశక్తి -కుప్పం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని రెస్కో చైర్మన్ ప్రతాప్, టిడిపి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్ పేర్కొన్నారు. కుప్పం టిడిపి కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, హియరింగ్ మిషన్‌లతోపాటు ఇతర పరికరాలు పంపిణీ చేశారు.

## 22 నుండి కపిలేశ్వరాలయ నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి కపిలేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబరు 22 నుండి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా కామాక్షి అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం ఆలయంలో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 18న ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. నవరాత్రి ఉత్సవాలకు సెప్టెంబరు 22న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవ కలశ స్థాపన, వాస్తుపూజ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 23న కామాక్షి దేవి, సెప్టెంబరు 24న ఆదిపరాశక్తి, సెప్టెంబరు 25న మావడి సేవ అలంకారం, సెప్టెంబరు 26న గాయత్రి అలంకారం, సెప్టెంబరు 27న బాల త్రిపుర సుందరి, సెప్టెంబరు 28న మహాలక్ష్మీ అమ్మవారు, సెప్టెంబరు 29న అన్నపూర్ణాదేవి, సెప్టెంబరు 30న మహిషాసురమర్ధిని, అక్టోబరు 1న సరస్వతి దేవి, అక్టోబరు 2న శివపార్వతుల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 2న చివరిరోజు అభయహస్త ఆంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు.